


ఐదు తరాల కిందట-

వేంకటాద్రి నాయనింవారు అమరేశ్వరాలయ నిర్మాణం పూర్తి చేశారు. రేపో మాపో స్వామి కళ్యాణం. హజారంలో రాత్రి పన్నెండు కొట్టినా నాయుడికి నిద్రపట్టలేదు. దేవాలయ నిర్మాణం ఆఖరున నిన్న ఉదయం తూర్పు దిశగా ధ్వజస్తంభం ప్రతిష్టించారు. ఆ ధ్వజస్తంభం ఎత్తుగా కృష్ణంతటినీ చూస్తూ ఠీవిగా ఉంది. ఆ ఎత్తయిన ధ్వజస్తంభాన్ని తలుచుకుంటే తన కీర్తి దేశమంతటా వ్యాపించినట్టు ఓ పిసరు గర్వరేఖ తోచింది.

హజారంలో ఒంటిగంట కొట్టారు.

"అయ్యో! పన్నెండు గంటలు మోగిన గంట కాస్తంతలో ఒకే ఒక్కగంట మోగిందే! నీ కీర్తి నలుపక్కలా పాకిపోయిందనుకున్నానే కాని నా చేతనైనంత స్వామిసేవ చేస్తున్నాననుకోలేదే!" అనిపించటంతో నాయుడిలోని గర్వరేఖ మాయమయి పోయింది. చేతులు ముకుళించి శయ్యమీదే కూర్చుండిపోయాడు.

కూర్చుండలేక శయ్యదిగి అంతఃపురం దాటాడు. అంతఃపురందాటి ప్రాకారం వెలుపలకు వచ్చాడు. వేకువనున్న అంగరక్షకులు వెంటరాబోగా వద్దని వారించి వెనక్కు వెళ్ళమన్నాడు.

ఆరుబయలులో కొచ్చి నుంచున్నాడు. పైన వెన్నెల, పందిట్లో మెరుస్తున్న చుక్కలు. చుట్టూతా నిద్రపోతున్న పట్టణం. దూరంగా కృష్ణమ్మ గలగల. ఆ గలగలకు తోడుగా మువ్వల సవ్వడి విన్పించింది. ఆ సవ్వడికి ఉలిక్కిపడి

నాలుగు పక్కలా చూశాడు. మళ్ళీ గాలిలో చిరుగంటల చప్పుడు. తలపైకెత్తి చూస్తే ధ్వజస్తంభానికున్న చిరుగంటలు గాలికి వూగుతూ మోగుతున్నాయి.

ఆ వెన్నెల!

ఆ నిశ్శబ్దం!

ఆ నిశ్శబ్దంలో మువ్వల సవ్వడి!

ఆ సవ్వడికి లేచిన రామచిలకలు కుహూ కుహూలు:

నాయుడు కదిలిపోయాడు. ధ్వజ స్తంభంవైపు నడిచిపోయాడు. గంటలు గాలికి నృత్యం చేస్తూ ఊగుతున్నాయి. ఆ ధ్వజస్తంభం నీడన ఓ బక్కమనిషి పద్మాసనం వేసుకుని  జపం చేసుకుంటున్నాడు.

ఆ మనిషి నిద్రపోవటం లేదు. పక్కనే ఆతని ఇల్లాలు, ఆరుగురు పిల్లలు పడుకుని ఉన్నారు. ఆ వ్యక్తి ముఖంలో తేజస్సు! కళ్ళు తెరవడు! పెదివి విప్పడు! గాలిలో గాయత్రి మంత్రం మోగుతోంది. నాయుడు అలాగే నిల్చుండిపోయాడు. తెలతెలవారుతూండగా అంతఃపురానికొచ్చి వాళ్ళని తీసుకురమ్మని కబురుపెట్టాడు.

ధ్వజస్తంభం దగ్గర ప్రత్యూషాన, కళ్ళు తెరిచాడు వేదాంతం లక్ష్మీపతిశాస్త్రిగారు ఆయన చతుర్వేదాలు పుక్కిట పట్టినవాడు. వేదసారమంతా గాయత్రిలో ఉందని గ్రహించి ఆ మంత్రాన్ని ఉఛ్వాస నిశ్వాసలుగా జపిస్తూ, జంధ్యాలు వడుకుతూ అందరికీ పంచిపెడ్తుండేవాడు. తనకైతే గాయత్రి మనసునిండా ఉంది. మరేం అక్కరలేదు. కట్టుకున్న ఇల్లాలికి  కడుపున పుట్టిన పిల్లలకో! మార్గం తెలిసింది కాదు. ఆ గాయత్రీదేవే చూసుకుంటుందని వూరూవాడా తిరుగుతూ స్వామి కల్యాణ సమయానికి అమరావతి చేరుకున్నాడు. కిందటిరాత్రి పిల్లలూ తనూ పట్టెడు వేరుశనక్కాయలు తిని మంచినీళ్ళు తాగారు.

ఎదురుగా భటులు.

ప్రభువు రమ్మంటున్నాడని పిలుపు.

కృష్ణ స్నానంచేసి వస్తానని కబురుపెట్టారు లక్ష్మీపతిశాస్త్రి. ఆ జవాబు అంతగా రుచించలేదు నాయుడికి.

అప్పటికే సభ తీర్చిన నాయుడు ముందుకి, స్నానం జపం ముగించుకున్న లక్ష్మీపతిశాస్త్రి వచ్చి నుంచుని 'శివాయనమః అని వందనం చేశాడు.

నాయుడు తనకు వందనం చేయలేదేమి అని మనసున భావించాడు. కాని ఎదురుగా తేజఃపుంజం. నాయుడు కావాలని అన్నాడు. "ప్రభువుల వద్దకు వస్తూ ఏమి కానుక తెచ్చారు?" అని.

లక్ష్మీపతిశాస్త్రి తబ్బిబ్బయినాడు. తన దగ్గర ఏమి కానుక ఉంటుంది. ఏమివ్వగలడు? సభ అంతా తనవైపే చూస్తోంది. ఒకచేయి జోలెలోకి పోనిస్తే నిన్న తిన్న వేరుశనక్కాయ తొక్కలు తగిలాయి. మళ్ళీ చెయ్యి పెట్టాడు. యజ్ఞోపవీతం తగిలింది. కళ్ళుమూసుకుని వేరుశనక్కాయ తొక్కని భద్రంగా మూసి "శివార్పణమ్! ఇది నా కానుక" అని భక్తితో నాయుడుకి సమర్పించాడు.

వేరుశనక్కాయ కానుకా?' సభ విస్తుపోయింది.

నాయుడు శనక్కాయని విప్పి చూశాడు. కళ్ళు మిరుమిట్లు గొల్పాయి. అందులో వజ్రవైఢూర్యాలు లేవు. స్వయంగా వడికిన యజ్ఞోపవీతం ఉంది. అందులో ఇమిడిపోయివుంది. నాయుడు దిగ్గునలేచివచ్చి పాపయారాధ్యులకు చూపించి చూశారా కానుక' అన్నాడు.

పాపయారాధ్యుల ముఖాన చిరునవ్వు.

'రేపు అమరేశ్వర కల్యాణానికి కావాల్సిన యజ్ఞోపవీతాన్ని స్వామి ఇలా సంతరించుకున్నాడు అంటూ లక్ష్మీపతిశాస్త్రిగారిని ఆసనంమీద కూర్చోపెట్టి "తమకేం కావాలో కోరుకోండి" అన్నాడు.

లక్ష్మీపతిశాస్త్రిగారు నవ్వి "నాకై ఏ కోరికలూ లేవు. మళ్ళీ మమకారాలేల? నా సంతతి పెరిగి పెద్దయ్యేదాకా ఏదన్నా ఆధారం దొరికితే అదే ఈశ్వర ప్రసాదం" అన్నాడు.

నాయుడు లక్ష్మీపతిశాస్త్రికి కుంచవరం అగ్రహారం ఈనాముగా ఇచ్చాడు. కాని లక్ష్మీపతిశాస్త్రి ఆ ఈనాము అనుభవించాడా! 'నాకెంత కావాలి?' అనుకుంటూ ఆ తుమ్మలూ, దుబ్బులూ కొట్టించి పండించినంత పండించి పదిమందికి ఇంతపెడ్తూ అందరికీ జంధ్యాలు పంచిపెడ్తూ కాలం వెళ్ళబుచ్చాడు.*